క్లుప్తంగా

క్రీడలతో మానసిక ఉల్లాసం



ప్రత్తిపాడు: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని గ్రంథాలయ అధికారి బి.అరుణ తెలిపారు. చిన్నతనం నుంచి ఆటలు ఆడటం వల్ల శారీరక వ్యాయామం అలవాటవుతుందని పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం బాలబాలికలకు నీతి కథలు బోధించారు. జనరల్ నాలెడ్జ్, ఇంగ్లిష్ చదివించడం చేయించారు. అనంతరం ఇండోర్ గేమ్స్ ఆడించారు. స్నేక్ అండ్ ల్యాడర్స్, చెస్, క్యారమ్స్ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి అరుణ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను సమ్మర్ శిక్షణ తరగతులకు పంపాలని కోరారు.

ఉద్యోగ విరమణ చేసిన ముగ్గురికి సత్కారం



నగరంపాలెం: పోలీస్ శాఖ నుంచి రావాల్సిన ప్రయోజనాలను సకాలంలో అందించేందుకు కృషి చేస్తామని జిల్లా ఏఎస్పీ(పరిపాలన) ఏవీ రమణమూర్తి అన్నారు. జిల్లా ఏఆర్ విభాగం ఏఎస్ఐ ఏ. రాఘవరాజు, తాడేపల్లి ట్రాఫిక్ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ బి.నాగేశ్వరరావు, చేబ్రోలు పీఎస్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ చేశారు. వీరిని శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని హాల్‌లో సత్కరించారు. జిల్లా ఏఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ పోలీస్ శాఖ అన్నివేళల్లో అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ అళహరి శ్రీనివాసరావు, సంక్షేమ ఆర్ఐ శివరామకృష్ణ, పోలీస్ అసోసియేషన్ సభ్యులు లక్ష్మణ్, హుస్సేన్, మైలా సాంబశివరావు, కరిముల్లా పాల్గొన్నారు.

రైలు ప్రయాణికులకు తాగునీటి బాటిళ్లు పంపిణీ



లక్ష్మీపురం: గుంటూరు డివిజన్ రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యార్థం తాగునీటిని బోగీల వద్దకు స్వయంగా వెళ్లి అందజేసినట్లు డీసీఎం కమలాకర్‌బాబు తెలిపారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు రైల్వే స్టేషన్‌లలో డీఆర్ఎం సుధేష్ణ సేన్ ఆదేశాల మేరకు రైలులో ప్రయాణించే సాధారణ ప్రయాణికులకు తాగునీటి వసతిని కల్పించే కార్యక్రమం శనివారం నిర్వహించారు. కమలాకర్‌బాబు మాట్లాడుతూ ప్రయాణికులకు వేసవిలో తాగునీటి కొరత లేకుండా ప్రతి రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారాలపై, రైళ్లలో చల్లని తాగునీటిని అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు. గుంటూరు, నరసరావుపేట రైల్వే స్టేషన్‌లలో ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు వలంటీర్ల ద్వారా పంపిణీ చేయించినట్లు చెప్పారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరి



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజస్వామి కళా వేదికపై గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో శనివారం శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. తొలుత పీఎల్ జయంతి, డాక్టర్ పి.చంద్రశేఖర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. స్థానిక కళాకారులు శ్రీత్యాగరాజ విరిచిత పంచరత్న కీర్తనలతో గోష్టి గానం నిర్వహించారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు బి.ప్రహ్లాద పలువురు వాగ్గేయకారుల కీర్తనలు ఆలపించారు. వయోలిన్‌పై ఎ.కామాక్షి, పీఎల్ జయంతి, మృదంగంపై కుందుర్తి అరవింద, ఏహెచ్ సూర్య వాయిద్య సహకారాన్ని అందించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి ఎంవై.శేషు రాణి పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

లక్ష్మీపురం: వసంత రాయపురం మలేరియా డివిజన్ వద్ద ఏఐటీయూసీ పతాకాన్ని మాల్యాద్రి శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈవిషయంపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల దగ్గర ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు నగరంలో కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నిత్యావసరాల ధరలు అమాంతం పెరగడం వల్ల కార్మికులు చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్, దిలీప్, కిరణ్, వెంకటేశ్వర్లు, కిశోర్, ఏడుకొండలు శ్రావణ్, బాలరాజు, శంకర్, సాంబయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై అశ్రద్ధ వద్దు



సమావేశంలో పాల్గొన్న అధికారులు



మాట్లాడుతున్న ఎంపీపీ ఇంటూరి పద్మావతి

గుంటూరు రూరల్: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి పద్మావతి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై పర్యవేక్షణ చేయాలని, నాణ్యత లోపాలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

ఎంపీపీ ఇంటూరి పద్మావతి

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, ఇప్పటికే చేపట్టిన పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఉదయం, సాయంత్రం నీటిని వదిలే సమయాన్ని ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. సమస్యలున్న చోట ట్యాంకర్స్ ద్వారా సరఫరా చేయాలని అధికారులకు ఎంపీపీ చెప్పారు. ప్రభుత్వం విభాగాల వారీగా ప్రజలకు అందిస్తున్న పథకాలు, లబ్ధిని ఆయా శాఖల అధికారులు వివరించారు. మండలంలో ఇటీవల విడుదల చేసిన పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి. శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'మలినేని' ప్రొఫెసర్‌కు పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్



విజయసారథిని అభినందిస్తున్న చైర్మన్ మలినేని పెరుమాళ్లు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగాధిపతి, ప్రొఫెసర్ డి.వి జయసారథికి పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ లభించినట్లు ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు తెలిపారు. ఆయన మలేషియాలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంప్యూటర్ సైన్సుల్లో, డిజిటల్ ఇన్నోవేషన్ యూసీఎస్ఐ విశ్వవిద్యాలయం (మలేసియా) నుంచి వైర్‌లెస్ కమ్యూనికేషన్‌లో రేణు కొలందైస్వామి పర్యవేక్షణలో చేసిన పరిశోధనలకు గాను పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్‌ను పొందినట్లు పేర్కొన్నారు. విజయసారథి పరిశోధన పత్రాలు అంతర్జాతీయ ఎస్‌సీఐ, యుటిలిటీ పేటెంట్ పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజయసారథిని శనివారం కళాశాలల చైర్మన్ మలినేని పెరుమాళ్లు అభినందించినట్లు తెలియజేశారు.

ఎన్‌సీసీతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

పెదకాకాని: ఎన్‌సీసీలో చేరడం వల్ల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వి.ఎస్. సుదర్శన్ తెలిపారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీలో శనివారం ఎన్‌సీసీ 10 ఏ గరల్స్ బెటాలియన్ , గుంటూరు గ్రూప్ 8వ వార్షిక శిక్షణ శిబిరం ప్రారంభమైంది. వీవీఐటీయూ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వి.ఎస్. సుదర్శన్, ఏఓ మేజర్ అవినాష్ పట్వాల్ పర్యవేక్షణలో పది రోజుల పాటు శిబిరాన్ని నిర్వహించనున్నారు. గుంటూరు గ్రూప్‌లోని వివిధ విద్యాసంస్థలకు చెందిన 426 బాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థులకు సైనిక సూత్రాలు, క్రమశిక్షణ, నాయకత్వం, మైత్రి, నైపుణ్యాల పెరుగుదల లక్ష్యంగా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిక్షణలో నేర్చుకునే ప్రతి అంశం క్యాడెట్ల ఉన్నతికి తోడ్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వీవీఐటీయూ ఎన్‌సీసీ ఆఫీసర్ ఎ. శ్రీవాణి, గుంటూరు ఎన్‌సీసీ బెటాలియన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ సిబ్బంది సేవలు అభినందనీయం



చెత్త తరలిస్తున్న ప్రజారోగ్య సిబ్బంది

నెహ్రూనగర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పర్యటన విజయవంతంలో గుంటూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య కార్మికులు, అధికారులు అంకితభావంతో పనిచేశారని, వారికి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. స్వచ్ఛ అమరావతి లక్ష్యంగా సభా ప్రాంగణంలో ప్రధాన వేదిక, వీవీఐపీ, కల్చరల్ వేదికలు, సుమారు 60 పబ్లిక్ గ్యాలరీల వద్ద ప్రధాని పర్యటన ముగిసే వరకు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా చేయడానికి గుంటూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య, మలేరియా విభాగాల నుంచి 500 మందికి పైగా కార్మికులు నిరంతరాయంగా విధులు నిర్వహించారని తెలిపారు. చెత్త సేకరణకు డస్ట్ బిన్లు, డంపర్ బిన్లు, కాంపాక్టర్లను అందుబాటులో ఉంచామని చెప్పారు. పార్కింగ్ ప్రాంతాల్లో ఆరు వందల మొబైల్ టాయ్ లెట్స్‌ని అందుబాటులో ఉంచి, వాటికి నీటిని కొరత లేకుండా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకున్నారని కమిషనర్ తెలిపారు.

కథలపై అవగాహన పెంచుకోవాలి



మహిళా బాలల గ్రంథాలయంలో కథ చెబుతున్న విద్యార్థిని

గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు కథలు చెప్పడం, డ్రాయింగ్, తెలుగు పద్యాలు, తెలుగు పొడుపు కథలు, జనరల్ నాలెడ్జ్, పుస్తక పఠనం గావించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారులు బి.శకుంతల, పి.సత్య శిరీష పర్యవేక్షించారు.

■ ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో ప్రథమశ్రేణి గ్రంథ పాలకుడు షేక్ ఖయ్యూం సమ్మర్ ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాగ్దేవి కృష్ణ మ్యాప్‌లో రాష్ట్రాలను గుర్తించే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

వీధి కుక్కల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు



ఏబీసీ సెంటర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో వీధికుక్కల నియంత్రణకు ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ రోజువారీ లక్ష్యానికి అనుగుణంగా ఏబీసీ చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఏటుకూరు రోడ్డులోని జీఎంసీ ఏబీసీ సెంటర్‌ని కమిషనర్ తనిఖీ చేశారు. తొలుత ఏబీసీ ఆపరేషన్ థియేటర్లు, మెడికల్ స్టోర్, సర్జరీ అనంతరం కుక్కలను ఉంచే గదులు, వాటికి ఇస్తున్న ఆహారాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏబీసీ సెంటర్లో నిర్దేశిత ప్రమాణాలతోనే కుక్కలకు ఆపరేషన్లు జరగాలన్నారు. గత నెల 23న పునఃప్రారంభించిన ఏబీసీ సెంటర్‌లో ప్రస్తుతం ప్రతి రోజు 25 కుక్కలకు ఏబీసీ, యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ జరుగుతుందని, సంఖ్యని పెంచడానికి చర్యలు తీసుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ వెంకటేశ్వరరావుకు సూచించారు. సెంటర్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, కుక్కలకు తగిన ఆహారం సమయానికి అందించడంలో సిబ్బంది బాధ్యతగా ఉండాలన్నారు. ఏబీసీ సెంటర్‌ని వారంలో 2, 3 సార్లు ఆకస్మిక తనిఖీలు చేస్తామని, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నగర ప్రజలు కూడా వీధి కుక్కల వల్ల సమస్యలు ఎదురైతే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863–2345103కి కాల్ చేయవచ్చని సూచించారు.

దీక్షలు విరమించిన క్రైస్తవ నాయకులు



తహసీల్దార్ వెంకటేశ్వరరావుకు వినతి పత్రం చేస్తున్న క్రైస్తవ సంఘాల నాయకులు

నెహ్రూ నగర్: మతాల మధ్య సామరస్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక పథకాన్ని ప్రారంభించాలని సామాజిక వేత్త డాక్టర్ గోళ్లమూడి రాజ సుందరబాబు డిమాండ్ చేశారు. క్రైస్తవ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 23 తేదీ నుంచి గుంటూరు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారంతో ముగిశాయి. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే హైకోర్టు జడ్జి పర్యవేక్షణలో సీబీఐ దర్యాప్తు జరిపించి పాస్టర్ ప్రవీణ్ విషయంలో నిజాలు వెలికి తీయాలన్నారు. క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు మద్దు ప్రేమ జ్యోతి బాబు మాట్లాడుతూ గుంటూరు నగరంలో క్రైస్తవులు సమాధుల కోసం స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వరరావుకి వినతి పత్రం అందజేశారు.

రేపటి నుంచి ఆధార్ క్యాంపులు

పొన్నూరు: ఆధార్ నవీకరణ (అప్డేట్)కు ఈ నెల 5నుంచి 15వ తేదీ వరకు వార్డు సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పొన్నూరు మున్సిపల్ కమిషనర్, ముప్పాళ్ల రమేష్‌బాబు తెలిపారు. 5, 6 తేదీల్లో 8,16,27వ వార్డు అంగన్‌వాడీ కేంద్రం, 7,8 తేదీల్లో 26, 9వ వార్డు అంగన్‌వాడీ కేంద్రం, 12,13 తేదీల్లో 23, 11వ వార్డు అంగన్‌వాడీ కేంద్రం, 14,15 తేదీల్లో 22,7వ వార్డు అంగన్‌వాడీ కేంద్రం, 12,15 తేదీల్లో 9వ నంబరు సచివాలయంలో ఆధార్ సేవలు లభిస్తాయని ఆయన వివరించారు.

రేపు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

లక్ష్మీపురం: దేశంలో అసంఘటిత, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు డిమాండ్ చేశారు. శనివారం గుంటూరు ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 5న కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కోటా మాల్యాద్రి పాల్గొన్నారు.

గ్రామీణ సంస్కృతి, వైభవానికి ప్రతీకలు ఎడ్ల పందేలు



ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో కేంద్ర మంత్రి చంద్రశేఖర్

చేబ్రోలు: ఎడ్ల బలప్రదర్శన పోటీల ద్వారా గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు తిరిగి వైభవాన్ని తీసుకు వస్తున్నట్లు ఉందని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. చేబ్రోలు మండలం క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు జరుగుతున్నాయి. శనివారం మూడో రోజు పోటీలకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ యంత్రాలు రాకముందు నుంచి ఎడ్లు మన జీవనాధారంగా ఉండేవన్నారు. ఒంగోలు జాతి ఎడ్లు అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాయని ఆయన తెలిపారు.

శిథిల భవనాలకు మోక్షమెన్నడో ?



పాత పోలీస్ స్టేషన్ భవనం



సబ్ జైలు భవనం

పొన్నూరు: పట్టణంలోని పలు ప్రభుత్వ భవనాలు వినియోగంలో లేక శిథిలావస్థకు చేరినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉండి పాములు, విష పురుగులు సంచరిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పాత పోలీస్ స్టేషన్ శిథిలావస్థకు చేరడంతో పోలీసు అధికారులు కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చారు. అయితే, అప్పటి నుంచి ఆ భవనం వినియోగంలో లేక శిథిలమైపోయింది. అక్కడే సమీపంలోని సబ్ జైలును కూడా వేరే ప్రాంతానికి తరలించడంతో ఆ భవనం కూడా శిథిలమైంది. దీంతో ఆ వైపు వచ్చేవారు ఈ భవనాలను చూసి భయపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

రేపటి నుంచి పోతులూరి గురుపూజ మహోత్సవాలు



గోడ ప్రతుల ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నగరంపాలెం: స్థానిక అమరావతిరోడ్డు బ్రహ్మంగారి గుడి వీధిలో కొలువైన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో ఆరాధన, గురుపూజ మహోత్సవాలు ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పాలక మండలి ప్రధాన కార్యదర్శి ఉమ్మడోజు నాగేశ్వరరావుచారి తెలిపారు. దేవస్థానం ఆవరణలో శనివారం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. నాగేశ్వరరావుచారి మాట్లాడుతూ సోమవారం స్వామికి పంచామృత అభిషేకాలు, 6న పతాకావిష్కరణ, గణపతి పూజ శాంతి హోమం ఉంటాయని తెలిపారు. 7న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర గురుస్వాముల సజీవ సమాధి నిష్ఠ వహించిన పర్వదినం సందర్భంగా పంచామృతాభిషేకాలు, పల్లకి సేవ ఉంటాయని అన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ, సాయంత్రం స్వామి నగర సంకీర్తన రథోత్సవ ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పావులూరి హనుమంతరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దామచర్ల శ్రీనివాసరావు, గట్టి శ్రీనివాసరావు, కుంకెపూడి కోటేశ్వరరావు, కొమ్మినేని కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు అడక శ్రీనివాస్, యాదవ్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే బంగారు భవిష్యత్

వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మ చరణ్



భూపేష్‌కు చెక్కును అందజేస్తున్న వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్

కొరిటెపాడు(గుంటూరు): ప్రతి విద్యార్థి చదువుపై అశ్రద్ధ వహించరాదని, ఉన్నత విద్య ద్వారానే విద్యార్థుల జీవితాలు బంగారు బాటలో నడుస్తాయని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ తెలిపారు. స్థానిక అరండల్ పేటలోని వేద సీడ్స్ కార్యాలయంలో గుడివాడలో నివసిస్తున్న భూపేష్ అనే విద్యార్థికి ఇంటర్మీడియెట్ పూర్తిచేసుకుని, తదుపరి సీఏ ఫౌండేషన్ కోచింగ్ కోసం తమ వంతుగా రూ.30 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందించారు. ఈ సందర్భంగా ధర్మచరణ్ మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డు కాకూడదన్నారు. దేశ సేవలో ఎంతో మంది గొప్ప వ్యక్తులు ఉన్నారని, వారందరినీ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ స్థాయికి తగ్గట్టు పేద విద్యార్థులను ఆదరించాలని సూచించారు. భవిష్యత్‌లో ప్రతి ఒక్కరూ ఉన్నత స్థానానికి చేరుకొని పేద విద్యార్థులకు సాయం అందించాలని ఆయన పిలుపునిచ్చారు.

పుణ్యక్షేత్రాలు సందర్శించిన దంపతులకు సత్కారం

నగరంపాలెం: ఇటీవల తెనాలి వాసి డాక్టర్ హనుమంతరావు(ఆయుర్వేదిక్), భార్య నగరాజకుమారి తెనాలి నుంచి ప్రయాగ, కాశీకి 70 రోజులు కాలి నడకతో పుణ్య క్షేత్రాలు సందర్శించారు. శనివారం జిన్నాటవర్ కూడలిలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో గౌరవ శాశ్వత అధ్యక్షులు ఆతుకూరి ఆంజనేయులు, అధ్యక్షులు యేల్చూరి వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు టి.విజయశ్రీ పాల్గొన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న దంపతులు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరులోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి తృతీయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి వేద పండితులు స్వామి శాంతి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. దంపతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు వేకువజామున దేవతామూర్తులను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలను చేసి విశేష పూజలు జరిపారు. వికాస తరంగిణి సభ్యులు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ చేశారు. శ్రీ సీతారామ భక్త సమాజం భజనలు ఆధ్యాత్మిక శోభను తెచ్చాయి. నారాకోడూరుకు చెందిన గాయత్రీ పీఠం సభ్యులు దంపతులతో గాయత్రీ హోమం చేయించారు. అనంతరం అన్నసంతర్పణ పెద్దఎత్తున చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కార్యనిర్వాహక అధికారి కృపాల్ రెడ్డి, గ్రామస్తులు, పెద్దలు చర్యలు తీసుకున్నారు.

నగరంలో పోలీసుల తనిఖీలు



లక్ష్మీపురం: వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డ్రంకన్ డ్రైవ్, బహిరంగ మద్యపానంపై వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా బహిరంగ మద్యపానం చేయడం, గంజాయి వంటి మత్తు పదార్థాలు తీసుకోవడం, స్థానికులతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఉంటే తక్షణమే తమకు సమాచారం తెలియజేయాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా సబ్ డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్ల కదలికలపై పూర్తి నిఘా ఉందన్నారు. అలాగే డ్రంకన్ డ్రైవ్ చేసిన వారిని గుర్తించి కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయని హెచ్చరించారు. ఆయన వెంట పట్టాభిపురం, నగరంపాలెం, అరండల్‌పేట సీఐలు గంగా వెంకటేశ్వర్లు, నజీర్‌బేగ్, ఆరోగ్యరాజు ఉన్నారు.